# క్రొత్తకోడలు

సింహాద్రి బ్రహ్మానందాచార్యులుగారు

కార్యం అయింతరవాత క్రొత్తగాకాపరానికివచ్చింది. అత్తవారింటికొచ్చేటప్పుడు అప్పగారు వెంటవచ్చింది. ఆవిడ చెల్లెలితో పదిపూటలువుండి నిముషనిముషానికీ జాగ్రత్తగాచూస్తూ ధైర్యంచెప్పింది. ఇహ యెన్నాళ్లువుంటుందికనుక? యెవరిసొత్తు వారికి అప్పచెప్పి ఆవిడవెళ్లిపోయింది. ఆవిడవెళ్లేటప్పుడు చెల్లెలితోటి—యేమీ భయపడకమ్మా! అంతామనవాళ్లేను. కొంచెంకొత్తగావుంటుంది, యెవరూనిన్నుయెఱిగినవాళ్లులేక. నాన్న మళ్లీ పదిరోజుల్లోవస్తాడు. అత్తయ్యచెప్పినట్టల్లా జాగ్రత్తగానడుచుకో. ఆడబిడ్డలేదైనా వేళాకోళంచేస్తారు. యేమీకోపంతెచ్చుకోకు. బావగారికీ మామయ్యకూ మన్ననచెయ్యాలి సుమా! చిన్నతనం నీకు, మరిచిపోయేవుకనుక. మే మెప్పోళమూ దగ్గిరవుండము. అయినా నీకొచ్చినభరవాలేదు. మామయ్య చాలామంచివాడు. అన్నీ ఆయనకనుక్కుంటూనేవుంటాడు. నీకేమీలోపంరానియ్యడు. అమ్మా, నాన్నా, అన్నయ్యా, తమ్ములూ, చెల్లెళ్లూ కనబడ్డంలేదని బెంగపెట్టుకోనేవు సుమా ఒకవేళ. నీయీడువాళ్లున్నారు. వాళ్లతోమంచిగావుంటే మరేమీభరవాలేదు. అబ్బాయి (అంటేమరిదిగారు) చాలామంచివాడు. అతనికలా యిష్టంగావుంటుందో అలాగే ప్రవర్తిస్తూవుండాలి సుమా; జాగ్రత్త. ఇదిమనస్సులోపెట్టుకో. వొళ్లుమైమరచి నిద్రపోవడం, పొద్ధకంగా ప్రొద్దుపుచ్చడం, యిలాంటివేమీపనికిరావు సుమా. సూర్యోదయం కాకుండానేలేచి అత్తయ్యకు సాయంగా ఈపనీ ఆపనీచేస్తూ, అవిడెలాచెపితే అలాచేస్తూవుండాలిసుమీ. ఒకవేళ—పెద్దదికాదూ మరి!—యేమైనా విసుగుకుంటుందనుకో, నీవుమాత్రం కోపంతెచ్చుకోకుమీ. అధికప్రసంగం చెయ్యడంకాని, యెవరేమిమాటాడినావూరికే ఆదేపనిగానవ్వడంకాని పనికిరావుసుమీ—అంటూయిలాంటివిసోకరో ఆవిడచెప్పింది—చెల్లెలిని బుజ్జగించింది; ఆవిడవెళ్లిపోయింది. కాస్తకష్టసుఖాలు నాటినవేమో, ఇండిలోకాలుపెట్టేవరకూ చెల్లెల్నిబుజ్జగించి ధైర్యంచెబుతూనేవుంది. ఒకకాసుసొమ్ము కూడా చెల్లెలిచేతిలో పెట్టివెళ్లింది. ఎంతచెబితేమాత్రం పాపంచిన్నతనంకాదూ—అక్కగారు వెళ్లిపోతూందంటే కొంచెం మొహంవేలాడేసింది; కళ్లనీళ్లుపెట్టుకుంది. చెల్లెలితో యేదో యీనాలుగుముక్కలూ చెప్పి వెళ్లిపోయిందా ఆవిడ? లేదు.—ముఖ్యంగా అత్తగారితో—యేదో మాచెల్లెలిసంగతి నేనుచెప్పకోకూడదుగాని, కొత్తగా అమాయకురాలండీ. నేను-వేరేమీకుచెప్పాలా? అన్నిటికీ మీరేవున్నారు. దానికొచ్చినలోటేముంది. యేదోకొత్తగా పుట్టింటిదగ్గిరనుంచి యిదేరావడంకదండీ మరి! అమ్మనీ, నాన్ననీ యిదివరకేమన్నావిడిచివుందా యేమన్నానా? అంచేత యేమన్నాకొంచెం యెప్పుడన్నా చిక్కమొహంవేయవచ్చు. మీరు కాస్తలాలనచేసి మంచిమాటలాడితే మరిచిపోయి అలవాటుపడుతుంది. నేనేమిటో ఆరిందాదానిలాగ, యిలాచెబుతున్నా అనిచెప్పిమరోలా అనుకుండేరు సుమండీ! మీరుపెద్దవారు. సర్వమూతెలిసినవారు. మాచెల్లెలిక్కడనుంచి మీసొత్తేకాని మాసొత్తుకాదు. అది మీఅమ్మాయికాని మాఅమ్మాయికాదు. ఇహసెలవుపుచ్చుకుంటానండీ. మళ్లీనేను మరదలు సుబ్బులక్ష్మిపెళ్లికివస్తానేమో—అని అత్తగారితో యెలాచెప్పాలో అలాచెప్పి, మరీవెళ్లింది. అందులో ఆవిడ యేమీలోటుచెయ్యాలే.

చెప్పడం మరిచిపోయాను. యీఅమ్మాయిపేరు లక్ష్మి. ఈఅమ్మాయిఅంటే కథానాయకురాలే సుమండి! పిల్ల చాలాలక్షణమైంది, బుద్ధిమంతురాలు కూడాన్నూ. అందుకేమీ సందేహంలే. తల్లిదండ్రుల పోషవర్గంలో చాలాజాగ్రత్తగా పెరిగింది. జాగ్రత్తగా పెరగడంఅంటే, యేదో యింటిపస్తుగా తినడమూ, టింగురంగా అంటూస్వేచ్ఛగా గంతులువేయడమూకాదు. చిన్నాపెద్దాఅనీ, మంచీచెడ్డాఅనీ, కాస్తసజావంవుండేందుకూ, కాపురానికెళితే యేదోకాస్తమంచిపేరూప్రఖ్యాతీతెచ్చుకుండేందుకూ, పిలుగావుండేటట్టు 464

తల్లిదండ్రులు తరిఫీదు చేశారు. స్వతహా తెలివితేటలుగలదయిందవడం చేత లక్ష్మి కాపరానికొచ్చేటప్పటికే యెంత మంచిపిల్లమ్మా యెంతమంచిపిల్ల అని అనిపించుకుంది. అంచేత ఇహముందైనా అలాగే అనిపించుకుంటుందనుకుందాం మనం.

అత్తవారింటికొచ్చి పదిహేనురోజులయింది—యిరవైరోజులయింది—నెల్లాళ్లయింది. కొత్త కొత్తల్లా కాస్తపాతగిల్లింది. ఇహ అత్తగారు కోడల్ని పిలవడంలో కొంచెం మార్పు తెచ్చింది. సలక్షణమైన 'లక్ష్మి' అన్న పేరుమానేసి 'లచ్చీ, లచ్చీ' అనడం మొదలెట్టింది. 'ఒసేలచ్చీ—యిలారా. ఈపని చెయ్యి, ఆపని చెయ్యి' అనడంలో దిగిపోయిందండి. 'లచ్చీ-లచ్చీ' అని కోడల్ని పిలిస్తే యేమైనా మునిగిపోయిందా? 'లక్ష్మి' అన్నది సంస్కృతం, 'లచ్చి' అన్నది అచ్చతెనుగూను. 'లచ్చి—లచ్చి' అని కేవలమూ ఆమహావిష్ణువు యొక్క అర్ధాంగినే కొమ్ములువచ్చిన కవిపుంగవులు సహితం సంబోధించేరుకదా, అందులో యేమీ తప్పు లేదు అనియెవరైనా అంటారేమో? సరే—అదినిజమే కాని యీసందర్భంలో మాత్రం కోడల్ని న్యూనతగా చూడాలనే వుద్దేశంతోనే అలాఅనడం మొదలుపెట్టింది. నేను చెప్పడం యెందుకు? మీకే తెలుస్తుంది. చూడండీ! ఈవిడకు ఒకకూతురుంది. ఆ అమ్మాయి పేరు సుబ్బులక్ష్మి. కూతుర్ని పిలిచేటప్పుడు మాత్రం 'తూచాలు' తప్పకుండా 'సుబ్బులక్ష్మి—సుబ్బులక్ష్మి' అంటూ దీర్ఘం తీసుకొని మహావయ్యారంగా పిలుస్తుంది. ఇహ కోడల్ని పిలిచినప్పుడో, అమాంతంగా యీ 'లచ్చీ—లచ్చీ' అన్న తెగులుదుతుంది! అచ్చతెలుగో లేక మరే తెగులో? పాపం మనలక్ష్మికిమాత్రం కొంచెంకష్టంతోచింది, నిజంచెప్పవద్దూ. అందుకు మనంయేమీ అనడానికివీలులేదు. పుట్టింటిదగ్గర—అక్కడవున్న దాసీదాన్ని 'లచ్చీ, లచ్చీ' అనిపిలుస్తారు. తనకీ అత్తగారింట అగతేపట్టింది. రోజులేదో యీడుస్తూనేవుంది—మహాకష్టంగా యీడుస్తోంది. అత్తగారు 'లచ్చీ'అని పిలవడంతోనే వొళ్లుమండుకుపోతూంది. ఒకటిరెండురోజులు వూరుకుంది. అక్కణ్ణుంచి 'లచ్చీ'అన్న పిలుపు వినడంతోనే కొంచెంముఖం జేవురించుకునేది. అత్తగారు యిదికనిపెట్టింది. 'యేమే, నేనుపిలవడంతోటే మొహమేమిటి అలాముడుచుకుంటావు? మామగారిదగ్గర మాత్రం మహాకలివిడిగానూ; మహా తెలివిగాను వుంటావు?' అని అనడం మొదలుపెట్టింది. పోనీ యేదో యిలాఅనివూరుకుంటుందీ! అబ్బే, అదిదేమిటీ—జగజ్జంత్రీ. 'మొహమేమిటే—యెప్పుడూ మొరటులాగే పెట్టుకుంటావ్? ఎప్పుడూ కొరకంచులాగే వుంటుందేం? నేనేంవిషంపెట్టేను నీకు?—నేనుపిలిచినా, నన్ను చూచినా అలాకొరకరలాడతావేం? మీఅక్కయ్య వెళ్లేటప్పుడు చెప్పిన పాఠాలాయేమిటివి?' అని అత్తగారు అంది.

మనలక్ష్మి యిహకోపంపట్టలేకపోయింది. 'ఇదేమిటండీ! మీరిలాఅనడం యేమీబాగాలేదు. పైగా మాఅక్కయ్యపేరెత్తుతారెందుకండీ, పెద్దవారుకూడానూ' అని మహాకష్టంమీదఅంది. అనకతప్పిందికాదు. యేంచేస్తుందిమరి? మంచిదికనక అంతటితో వూరుకుంది. మరోలాంటిదైతేనా దూసుకో అంటేదూసుకో అని కచ్చాబిగించకపోయిందా? ఎలాగైతేనేం, అత్తగారు క్రమక్రమంగా కొంచంఅధికారం చలాయించడం మొదలు పెట్టింది.

ఏపాటి హెచ్చురగ్గువచ్చినా బ్రహ్మరాక్షసి యీఅత్తగారు. నిలుచుంటే మరామేకు, కూర్చుంటే మరామేకు అంటారే—ఆమోస్తరుగావచ్చింది లక్ష్మిసంగతి. పాపం యెవరితో చెప్పుకుంటుంది—యెవరితో చేస్తూంది? బాగాచదువుకున్నదికూడాను. ఐతేమాత్రం, ఒక్కమీసమెత్తయినా తల్లిదండ్రులకు వ్రాసిందా?—లేదు. వ్రాయదలుచుకోలేదు. తన తెలివితేటలచేత తానేసమర్థించుకోవాలనుకుంది. ఛావగొట్టి యింటిచాకిరీఅంతా చేయిస్తూనేవుంది అత్తగారు. కదిలితేపోటూ—మెదిలితేపోటూ. తానేమాత్రం యేంచేస్తుంది? మహాఓరిమిపట్టి రోజులు యీడ్చుకొస్తూంది. భర్త విష్ణువర్ధనరావు అయేదే బియ్యే ప్యాసయాడు.

ఇంకాయేవుద్యోగంలోనూ ప్రవేశించలేదు. ఒక్కసుగుణం! ఈతడుమట్టుకుమాత్రం మూర్ఖుడుకాడు. చదువుకుంటేమాత్రం యెంతమంది దరిద్రగొట్టుదద్దమ్మలులేరు? భార్యయొక్క సుగుణాలుబాగాగ్రహించేడు, కుర్రాడైతేనేంగాను. తల్లియొక్క బుద్ధివిశేషతలు అతనికి బాగాతెలుసును. ఐతేనేం? భార్యను అన్యాయంగాబాధపెడుతున్నానని యేమన్నా అనగలడా? నిజమే; నిజంగా—అనవసరంగా—బాధపెడుతూనేవుంది. కాని యీవిషయమై యేమన్నాఅంటే అల్లరివచ్చిపోతుంది మరి? ఒకవేళ తెగించిఅంటే, తండ్రిమనస్సుకు యేమినొప్పితోస్తుందో? తండ్రి చాలామంచివాడు. బహుయోగ్యుడు. భార్యగుణాలన్నీ బాగాతెలుసును. గయ్యాళిగత్తెని తెలుసు. ఖర్మంచాలక యేదన్నాఅన్నాడో, ఆతనిపరువుమర్యాదలు వీథులలో వున్నాయన్నమాటే. అంచేత మనలక్ష్మిభర్త చూచీచూడనట్టుపైకి వూరుకున్నప్పటికీ, పడకటింటరాత్రిసమయాల్ని, ఆవిడమనస్సు మహా ఆహ్లాదకరంగావుండేటట్టు ప్రవర్తించేవాడు. భర్తయందు లక్ష్మికిచక్కని ప్రేమకుదిరింది. అంచేత తనకేమీభయంలేదుకదా అనిమనోధైర్యమూ, నమ్మకమూ బాగాకలిగింది. అత్తగారిహ యెన్ననుకున్నా, తననుకానట్టే. తనపనియేదో తనుజాగ్రత్తగా చేసుకునేది. ఇహఈమనిషినైజం యింతేకదా అనుకుంది. మరెందుకు వృథావాగ్వివాదం అని ఊరుకుంది.

కాని కోడలువూరుకుంటే అత్తగారు వూరుకుంటుందీ? తనకు తోడయేటట్టు కూతుర్నికూడా కాస్త యెగదోసింది. కొంచెంయించుమించు, మూడుమూర్తులా తల్లేతల్లి—కూతురేకూతురు. చిన్నప్పటినుంచీ రణరాలుగాయి. ఇలాఅంటున్నాన్ని మీకుకోపంవస్తే చెప్పలేను. వంచడానికెవ్వడికీశక్యంలేదు. ఆవిడస్నానంచేయడానికి సిద్ధమైతే వదినెగారు వేడినీళ్లూ, పరికరాలు పుచ్చుకొని అడుగులకుమడుగులొత్తుతూ సేవచేయవలసిందే. కట్టువిడిచినగుడ్డ వుతకవలసిందే. లేకపోతేమాపట్టుపట్టిలేచిపోతుంది. వదినెగారు విస్తరితియ్యాలిసిందే. మధ్యాహ్నము మూడుఘంటలయ్యేటప్పటికల్లా వదినగారు యెంతయెలాంటిపనిజేస్తున్నా సరే కొబ్బరినూనె, దువ్వెనాతెచ్చి ఆవిడతలదువ్విజడవేసి శృంగారించవలసిందే. ఇందులో యేదిలోటువచ్చినాసరే, దూదేకినట్టుయేకేస్తుందిగా! ఎవడుకట్టుకుంటాడోకాని బాబూ!—బ్రహ్మరాక్షసిలోనైనా కాపరంచెయ్యొచ్చుగాని—అమ్మ! దానితో యెవడువేగ్గలడుబాబూ, యిప్పుడేయిలావుందీ? యెవడో తగినవాడు దొరకాలి—తెగులుకుదరాలి. అంతవరకూ క్రిందబెడితే యెండలులేవు——పైనబెడితే వానల్లేవు! నిముషనిముషానికీ ఆపిల్లయెముకలు కొరుక్కుతినేసేదికాదూ! ఎందుకైనా తగినవాళ్లురా నాయనా!—తల్లికి తల్లీ, పిల్లకుపిల్లాన్నూ!

విష్ణువర్ధనరావు చూచేడు, చూచేడు. అంతకంతకూ ముదిరిపోతూందిరా అనుకున్నాడు. దీనికేమిటా?—గత్యంతరమేమిటా అని ఆలోచించేడు. ఒకనాడు ఏదిపాలుపోయిందికాదు. విసిగిపోయి న్యూసుపేపరు చదువుదామనివిప్పేడు. మదరాసులో యేదో 40 రూపాయిలు గుమాస్తాపనికావాలన్నట్టు ప్రకటనచదివేడు. తక్షణం ఒకవిధమైన ఉత్తేజంవచ్చింది. మర్నాడు బయలుదేరేడు, యెవరితోనూచెప్పకుండా. అదృష్టం—గుడ్డిలోమెల్ల—యేదోబాగుంది. సరే, అనుకున్నవుద్యోగం దొరికింది. తిరిగియింటికి వచ్చేడు. తండ్రిగారితో యీసంగతిస్పష్టంగాచెప్పేడు. భార్యనువెంటబెట్టుకొనే వెళతానని తండ్రిగారితోఅన్నాడు. తండ్రి బాగాఆలోచించేడు, కోడలుయొక్క సుగుణాలన్నీ గ్రహించినవాడవడంచేత, కొడుకుచెప్పిందే బాగుందనుకున్నాడు. ఒకమంచిరోజుచూచుకున్నారు. మదరాసుకు సుఖంగాప్రయాణం అయ్యేరు భార్యాభర్తలిద్దరూను. కోడల్నిపంపించనని మొట్టమొదట అత్తగారడ్డుపడింది. ఘంటాపథంగా 'నేనుతీసుకువెళ్లకతప్పను, నాయిష్టం' అని విష్ణువర్ధనరావుఅన్నాడు. లక్ష్మి అత్తగారికీ, మామగారికీ నమస్కారంచేసి, 'వెళ్లివస్తాను సుబ్బులక్ష్మీ!' అని ఆడబిడ్డతోచెప్పి, భర్తతో సుఖంగామద్రాసుచేరింది.—హాయిగాజీవనం చేస్తూంది.

468